క్లుప్తంగా

వైవీ, పిన్నెల్లిని కలిసిన చెన్నారెడ్డి



రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన నవులూరి చెన్నారెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నవులూరి చెన్నారెడ్డి శనివారం పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలను కలిసి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వినుకొండ కౌన్సిల్‌లో సదావర్తి భూములపై చర్చ

వినుకొండ: స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గత సమావేశాల్లో అజెండాల మిగిలిపోయిన 38 అంశాలపై చర్చించారు. సదావర్తి భూముల్లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ వారికే అప్పగించాలని కొంతమంది కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ చైర్మన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. మున్సిపల్ నిధులతో ఆ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించామని, కోర్టులో కేసు ఉన్నందు వలన అవి అలానే నిలిచిపోయాయని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ వివరణ ఇచ్చారు. అయితే సదావర్తి భూముల్లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పూర్తి స్థాయి ఖర్చులను వారే భరించి వారి ఆధీనంలో షాపులు ఉంచుకుంటారని అందుకు అనుమతించాలని కొంతమంది కోరారు. తదుపరి సాధ్యాసాధ్యాలను పరిశీలించిన అనంతరం నిర్ణయించి తీసుకుంటామని అధికారులు కౌన్సిల్ సభ్యులు తెలియజేశారు. అనంతరం స్థానికంగా ఉన్న సమస్యలు ట్రాఫిక్, విద్యుత్, మురుగునీటి సమస్య వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా

వినుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా శనివారం నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 28 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 1666 మంది అభ్యర్థులు హాజరుకాగా కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 521మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు, స్కిల్ డెవలప్‌మెంట్ అదనపు జిల్లా అధికారి రామాంజనేయులు, జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి ఎం.రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

నరసరావుపేటటౌన్: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన యాసారపు ఇమ్మానియేలు, త్యాగలముడి గోపి ఇద్దరూ ద్విచక్రవాహనంపై గుంటూరు రోడ్డు వైపుకు వెళ్తుండగా స్వర్ణపురి సమీపంలో శ్రీశైలం నుంచి గుంటూరు వైపుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. సంఘటనలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. 108 సహాయంతో క్షతగాత్రులిని నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హైమారావు తెలిపారు.

అనాథలకు ఆసరాగా 'స్నేహ హస్తాలు'

అచ్చంపేట: గుండెపోటుతో తండ్రిని, అనారోగ్యంతో తల్లిని పోగొట్టుకున్న విద్యార్థులకు స్నేహ హస్తాలు ఆసరాగా నిలచింది. బీటెక్ చదువుతున్న ఇద్దరికి రూ.1,20,000 చెక్కును స్థానిక సీఐ పోలూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు విద్యార్థుల చదువు ఆగిపోకుండా స్నేహ హస్తాలు ఆదుకోవడం అభినందనీయమని తెలిపారు. స్నేహ హస్తాలు ప్రతినిధి తాయి కరీముల్లాబాబు మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన మద్దినేని శిరీష విజయవాడలోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం, మద్దినేని భానుతేజ విజయవాడలోనే క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నారని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో హార్ట్ ఎటాక్‌తో తండ్రి చనిపోగా, గతంలోనే తల్లి అనారోగ్యంతో మృతి చెందిందని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్నేహహస్తాలు ప్రతినిధి మన్నెం భద్రయ్య పాల్గొన్నారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దాం



పిడుగురాళ్లలో వెన్నుపోటు దినం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన మీద, ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నాయకత్వం తీసుకున్న నిర్ణయం మేరకు 4వ తేదీన వెన్నుపోటు దినంగా ప్రకటించటం జరిగిందన్నారు. ప్రజలను నమ్మించి, వంచించి, అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, ఏ ఒక్క హామీని నెరవేర్చకుండ మోసపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. ప్రజల కష్టాలల్లో పాలు పంచుకోవాల్సిన బాధ్యతగా, ప్రజల గొంతుగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీలు అల్లు పిచ్చిరెడ్డి, గండికోట కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, నియోజకవర్గ యూత్ కన్వీనర్ బోల్నేడి సాంబశివరావు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మోర్జంపాడు ఖాశీం, కావూరి రామాంజనేయులు, టి.సాల్మన్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజం



మాచవరంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మాచవరం: ప్రజలను మోసం చేయడమే టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ 4న నిర్వహించ తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండల కేంద్రంలో శనివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి, అధికారం చేపట్టిన తర్వాత ప్రజలను మోసం చేశారని విమర్శించారు. జిల్లా కేంద్రాల్లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మద్దు ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు శివాయాదవ్, రైతు సంఘ నాయకులు గుర్రం గురవారెడ్డి, నాయకులు దారం లచ్చిరెడ్డి, వంకాయల రమేష్, సురేష్, అనిల్‌కుమార్, అంబటి కోటయ్య, పుల్లారెడ్డి, జానీ, సర్పంచి నరేష్ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

గురజాల: హెచ్ఐవీ/ ఎయిడ్స్‌పై ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ పల్నాడు కళాజాతర ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద జానపద నాటకం ద్వారా కళాజాతా బృందం ఆధ్వర్యంలో వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ/ ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుందని వివరించారు. ఆ వ్యాధి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. వ్యాధిగ్రస్తులపై చిన్న చూపు చూడరాదని నాటకం ద్వారా వివరించారు. హెచ్ఐవీ/ ఎయిడ్స్ వ్యాధి సోకిన వారు విధిగా ఏఆర్‌టీ కేంద్రాల వద్ద మందులు అందించడం జరుగుతుందని క్రమంతప్పకుండా మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో గురజాల ల్యాబ్ టెక్నిషియన్ కృష్ణ, ఏఆర్‌డబ్ల్యూ రమాదేవి, సుందరమ్మ, ఝాన్సీ, కనికరమ్మా, కళాజాతా బృందం సభ్యులు వి.మల్లికార్జునరావు, వెంకటలక్ష్మి, మల్లయ్య, కనకరావు, ప్రభావతి, శాంతి పాల్గొన్నారు.

రామకృష్ణ సేవా సమితి సేవలు అభినందనీయం

మాచర్ల: శ్రీ రామకృష్ణ సేవా సమితి మాచర్ల ఆధ్వర్యంలో స్థానిక శ్రీశైలం రోడ్‌లోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో స్పోకెన్ ఇంగ్లిష్, నైతిక, ఆధ్యాత్మిక విలువల క్లాసులు ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్‌బీకేఆర్ జూనియర్ కాలేజ్ కళాశాల అధ్యాపకులు దుర్గ, శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు సమయం వృథా కాకుండా ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ కంప్యూటర్స్ కోచింగ్, యోగ, స్పోకెన్ ఇంగ్లిష్, నైతిక ఆధ్యాత్మిక విలువలు తదితర వాటి క్లాసులు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవింద రెడ్డి ఆధ్వర్యంలో మాచర్ల పట్టణ, పరిసారా గ్రామ ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వటం సంతృప్తికరంగా ఉందని చెప్పారు. అంతేకాకుండా వారికి మంచి ర్యాంకులు సాధించేందుకు మంచి కాలేజీలలో సీటు సాధించేందుకు ఈ క్లాసులు ఉపయోగపడతాయన్నారు.

ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఇంటర్‌లో ఉచిత ప్రవేశం

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ట్రస్ట్, దాతల సహకారంతో ఈ విద్యా సంవత్సరం 30 మంది తల్లిదండ్రులు లేని పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ మీడియెట్‌లో ప్రవేశం కల్పిస్తున్నట్లు ఆశ్రమం వంశపారంపర్య ధర్మకర్త, మఠాధిపతి చింతాడ లలితాంబ మాతాజీ శనివారం తెలిపారు. ఎటువంటి ఫీజు లేకుండా ఆశ్రమం తరఫున నిర్వహిస్తున్న విద్యాసంస్థలో ఎంపీసీ, బైపీసీ ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లలో ఉచిత ప్రవేశంతో పాటు యూనిఫామ్, నోట్ బుక్స్, ప్రభుత్వం ద్వారా హాస్టల్‌లో ఉచిత విద్యను అందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా పరిషత్, సోషల్ వెల్ఫేర్, మోడల్, కేజీబీవీ పాఠశాలలో చదివిన వారికి ప్రాధాన్యం ఇస్తామని, పదవ తరగతిలో 400 పైగా మార్కులు సాధించినవారు ఉచిత అడ్మిషన్‌లకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసి సీటు కేటాయిస్తామని తెలిపారు. దరఖాస్తులను జూన్ 10వ తేదీలోగా శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, గుంటూరు రోడ్డు, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా అనే చిరునామాకు పోస్ట్ ద్వారా లేదా 8096824399, 7989927520 నంబర్లకు వాట్సాప్ ద్వారా దరఖాస్తులను పంపాలని ఆమె సూచించారు. దరఖాస్తుతో పాటు పదవ తరగతి మార్కులలిస్ట్, స్టూడెంట్ ఆధార్, మదర్ ఆధార్, రేషన్ కార్డు, అర్హతకు సంబంధించి సొంత వివరణతో అర్జీ పంపాలని తెలిపారు.

లింగాపురంలో లూథరన్ చర్చి ప్రారంభం



పార్థనలు చేస్తున్న బిషప్ పరదేశిబాబు

అమరావతి: మండల పరిధిలోని లింగాపురంలో నూతనంగా నిర్మించిన పరిశుద్ధ పౌలు లూథరన్ దేవాలయం ప్రారంభోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడరేటర్ ఏఈఎల్‌ఎల్‌సీ బిషప్ కె.ఎఫ్. పరదేశి బాబు, గుంటూరు సినడ్ బిషప్ ఎస్.జె. బాబూరావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లింగాపురం ప్యారిస్ పాస్టర్ కరుణకుమార్ ఆధ్వర్యంలో ఇతర గురువులు ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బిషప్ కె. ఎఫ్. పరదేశి బాబు మాట్లాడుతూ వ్యయప్రయాసలకు ఓర్చి అత్యంత సుందరమైన ఆలయాన్ని నిర్మించుకున్న లింగాపురం వాసులను అభినందించారు. ప్రతి ఒక్కరూ శాంతి, సహనం, సహాయపడే గుణం అలవర్చుకుని క్రీస్తు బోధనలను ఆచరించాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, చర్చి నిర్మాణ కమిటీ చైర్మన్ కె. రామారావు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశు పోషకులకు సబ్సిడీపై దాణా పంపిణీ



దాణా అందిస్తున్న పశుసంవర్థక శాఖ అధికారులు

అచ్చంపేట: పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై పాల ఉత్పత్తిదారులకు పశువుల దాణా సరఫరా చేస్తోందని పశుసంవర్థక శాఖ వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. స్థానిక పశువైద్యశాల వద్ద శనివారం ఆమె దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి విడతగా మండలానికి 180 క్వింటాళ్ల దాణాను ప్రభుత్వం సరఫరా చేసినట్లు చెప్పారు. అసలు ఖరీదు క్వింటా రూ.1100కాగా 50శాతం సబ్సిడీపై రూ.550కే పశు పోషకులకు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. పశు పోషకులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాల దిగుబడిని పెంచుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ బాయి, గ్రామ సర్పంచ్ షేక్ జాని, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో పి.రవికుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మేట్లతో మాట్లాడుతూ సమయపాలన పాటించాలని సూచించారు. కొలతల ప్రకారం కనీస వేతనం వచ్చేలాగా కూలీలతో పనులు చేయించాలని సూచించారు. జాబ్ ఉన్న ప్రతి ఒక్కరు పనికి వచ్చే విధంగా, ఇచ్చిన టార్గెట్ ప్రకారం పనులు చేయించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 37 పనుల్లో 482 గ్రూపులకు చెందిన 3,752 కూలీలు పనిచేస్తున్నట్లు తెలిపారు.

సేవలు అందించే అవకాశం పోలీసులకే..

పదవీ విరమణ పొందిన వారిని సన్మానించిన జిల్లా ఎస్పీ



నరసరావుపేట: ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండి వారి సాధకబాధకాల్లో మమేకమై సేవలందించే అవకాశం పోలీసు శాఖకే ఉంటుందని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన వి.వెంకయ్య (కమ్యూనికేషన్, ఎస్ఐ), జి.కోటిరెడ్డి (ఏఎస్ఐ అయినవోలు పోలీస్ స్టేషన్), కె.వెంకటేశ్వర్లు (ఏఎస్ఐ, చిలకలూరిపేట రూరల్), ఆర్.మధుసూదనరావు (ఏఎస్ఐ, డీటీసీ, పల్నాడు), ఎం.నాగేశ్వరరావు (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్)ను శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ వి.సత్తిరాజు, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు, ఆర్ఐలు పాల్గొన్నారు.

ఒత్తిడికి యోగా ప్రయోజనకరం

నరసరావుపేట: నిత్యం విధుల్లో ఒత్తిడికి లోనయ్యే సిబ్బందికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని డ్వామా పీడీ లింగమూర్తి అభిప్రాయపడ్డారు. యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా యోగా వీధిలో శనివారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగాలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో అధిక లాభాలు



రాజుపాలెం: పామాయిల్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని సస్యరక్షణ శాస్త్రవేత్త మోడల్ అధికారి డాక్టర్ సీహెచ్. అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని గణపవరం రైతు సేవాకేంద్రంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా విజ్ఞాన కేంద్రం లాం ఫాం ఆధ్వర్యంలో శాస్త్రజ్ఞులు రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై శనివారం శిక్షణ ఇచ్చారు. డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ పత్తి, మిరప అపరాల పంటలలో సస్యరక్షణ గురించి రైతులకు వివరించారు. మండల ఉద్యాన అధికారి పామాయిల్, అరటి, బొప్పాయి పంటలకు ప్రభుత్వ రాయితీల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య, రవిచంద్రన్, వీఏఏ సునీల, ఎంపీఈవో వెంకయ్య, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



బస్టాండ్ సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

అమరావతి: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణల్లో భాగంగా రవాణా, పోలీస్ శాఖలతో పాటు ఆర్టీసీ అధికారులు శనివారం సాయంత్రం సంయుక్త తనిఖీలు నిర్వహించారు. సుమారు 80 వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో 36 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అందులో ఐదు వాహనాలను స్వాధీనం చేసుకుని అమరావతి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అపరాధ రుసుం కింద రూ.80,600 వసూలు చేశారు. తనిఖీల్లో ఆర్టీసీ డీఎం రాజశేఖర్, సీఐ వై.అచ్చయ్య ఎస్ఐ కె.అమీర్, రవాణా శాఖ సహాయ తనిఖీ అధికారి ఎం.సురేష్ బాబు పాల్గొన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సహాయ తనిఖీ అధికారి ఎం.సురేష్‌బాబు తెలిపారు

పొగాకుతో పొంచిఉన్న ప్రమాదం



ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

రెంటచింతల: పొగాకు ఉత్పత్తులతో ప్రాణహాని పొంచి ఉందని వాటికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని తహసీల్దార్ దొప్పలపూడి మేరీ కనకం అన్నారు. శనివారం వరల్డ్ నో– టుబాకో డే సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాసరావు, బీజేపీ మాచర్ల నియోజకవర్గ నాయకులు పోకూరి కాశీపతిలతో కలసి ఆమె ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పోస్టర్లను ఆవిష్కరించారు. పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడి, చుట్ట, ఖైనీ, గుట్కా, పాన్ పరాగ్ వంటి వలన 70 శాతం గుండెపోటు, 40 శాతం క్యాన్సర్ వస్తుందని హెచ్చరించారు. ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో పొగతాగడాన్ని నిషేధిస్తూ 2002లో చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఆ చట్టాన్ని ఆచరణలోకి రాలేదని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎ.నాసరయ్య, కట్టెబోయిన సైదులు పాల్గొన్నారు.

నేడు తెలుగు సినిమా పాటల పోటీలు

మాచర్ల: గాన గంధర్వుడు డాక్టర్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని మాచర్ల పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో జూన్ ఒకటిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయి సినిమా పాటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళాపరిషత్ అధ్యక్షుడు కొత్తమాసు శ్రీరామమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు ఎంపికలు ఉంటాయన్నారు. ఈ ఎంపికలో 25 మంది గాయకులను ముగ్గురు న్యాయ నిర్ణేతలు ఎంపిక చేస్తారని, ఎంపికైన గాయకులతో అదే రోజు సాయంత్రం 7 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరవుతారని చెప్పారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7 వేలు, మూడో బహుమతి రూ. 5 వేలు, నాలుగో బహుమతి రూ.4 వేలు, 5వ బహుమతి రూ.3 వేలు అందజేయనున్నట్లు వివరించారు. ఎంపికైన మరో 20 మంది గాయకులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా లక్కీ డ్రా ద్వారా పది మంది మహిళలకు రూ.వెయ్యి విలువ చేసే పది చీరలను అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రకటనలో కోరిన వారిలో ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పఠాన్ జాన్ ఖాన్, ఉపాధ్యక్షుడు బాహాటం శేషగిరి రాజు, సహాయ కార్యదర్శి పులుసు శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓరుగంటి చెన్నకేశవరావు ఉన్నారు. ఇతర వివరాల కోసం 9505453457, 9573786029, 9866537346 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. దాచేపల్లి సచివాలయం–1లో కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. చైర్‌పర్సన్ అధ్యక్షత వహించారు. వార్డుల్లో ఉన్న మంచినీటి సమస్యలు పరిష్కరించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ.. తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టిని సారించాలని, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, మురుగు కాలువలకు మరమ్మతులు నిర్వహించి, బ్లీచింగ్ చల్లాలని కోరారు. నగర పంచాయతీ పరిధిలో రోడ్ల వెంట ఉన్న పిచ్చిచెట్లు తొలగించాలని, నీటి సరఫరా పైపులకు ఏర్పడిన లీకేజిలకు మరమ్మతులు చేయాలని కోరారు. సమావేశంలో కమిషనర్ వైవీ అప్పారావు, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన అన్నపూర్ణ, షేక్ మస్తాన్‌బీ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయులకు సన్మానం



పదవీ విరమణ చేస్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో అక్షరాస్యత సాధన, విద్యాభివృద్ధి కోసం నిరంతరం శ్రమించి వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన విల్సన్, కోటేశ్వరరావు అభినందనీయులని జెడ్పీహెచ్ బాలురోన్నత పాఠశాల హెచ్ఎం ఎం.రామారావు అన్నారు. శనివారం పట్టణంలోని పాఠశాలలో ఉపాధ్యాయుల పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. వి డేవిడ్ విల్సన్, కొరటా కోటేశ్వరరావు 35 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసి విద్యాభివృద్ధిలో తమదైన శైలిలో విద్యార్థులకు విద్యాబోధనందించి క్రమశిక్షణ, విలువలతో కూడిన వాతావరణాన్ని పాఠశాలలో ఏర్పాటు చేసిన ఘనత వారిదేనన్నారు. విల్సన్ యూనియన్ నాయకుడుగా, యూనియన్ నాయకుడుగా తోటి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తూనే దైవ సేవకుడుగా చర్చి అభివృద్ధిలో ఆయన కృషి కొనసాగించినట్లు చెప్పారు. కోటేశ్వరరావు జిల్లా, మండల ఎడ్యుకేషన్ కార్యాలయంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తూనే సర్వీసు రికార్డులలో మార్పులు చేర్పులు చేస్తూ అత్యున్నతమైన, విలువైన సేవలు అందించిన ఘనత వారికే దక్కుతుందన్నారు. అనంతరం కొరటా కోటేశ్వరరావు, విల్సన్ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్ బాబు, పిచ్చయ్య, అమర్‌నాథ్, ఎక్సమస్ జాన్, షేక్ సిలార్ అహ్మద్, గోపాలరావు పాల్గొన్నారు.

హెచ్ఎం రామారావుకు సన్మానం

మాచర్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దటమే కాకుండా 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మార్కులు సాధించటంలో హెచ్ఎం ఎం.రామారావు కృషి అభినందనీయమని ఇన్‌చార్జి హెచ్ఎం బత్తుల అమర్‌నాథ్ అన్నారు. శనివారం పట్టణంలోని జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న రామారావు అభినందన సభ నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య పెంచటంతో పాటు ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెంచి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎం.రామారావు, లక్ష్మి దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తాటి భాస్కర్‌బాబు, తాటి రాజశేఖర్, జె.గంగాధర్‌బాబు, షేక్ సిలార్ అహ్మద్, ఎక్సమస్ జాన్, నజీర్, బాలు నాయక్, సౌజన్య, సునీత, లత, జి.పద్మ, ఏడుకొండలు, డేవిడ్ రాజు, గోపాల్‌రావు, కృష్ణా నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

క్రోసూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు చేపట్టే ప్రజా ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు భైరవపట్నం రామకృష్ణ కోరారు. క్రోసూరులో శనివారం నిర్వహించిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2న క్రోసూరులో మధ్యాహ్నం రెండు గంటలకు సీపీఐ మండల మహాసభ నిర్వహిస్తున్నామని, నాయకులంతా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సీపీఐ నాయకులు చెన్నకేశవ, వెంకట్రావు, కరీముల్లా, శ్రీనివాసరావు, పోతుగంటి నాగేశ్వరరావు, పసుపులేటి యాదగిరి పాల్గొన్నారు.